సాక్షి నంద్యాల

శుక్రవారం । 13 । జనవరి । 2023



చండీశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు



విద్యుత్ దీపాలంకరణలో ఆదిదంపతులు



పుష్పాలంకరణలో ఆలయ ధ్వజస్తంభం

న్యూస్‌రీల్

15లోగా ఈకేవైసీ చేయించాలి


● జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ

మహానంది: పీఎం కిసాన్ నగదు జమకాని రైతులతో ఈ నెల 15లోగా ఈకేవైసీ చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి టి.మోహన్‌రావు సూచించారు. గోపవరం, సీతారామాపురం గ్రామాల ఆర్బీకేలను గురువారం తనిఖీ చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ కోసం అర్హత ఉన్న రైతుల ధ్రువీకరణను వెంటనే పూర్తి చేయాలన్నారు. రబీ పంట నమోదును వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఆర్బీకేల్లో ప్రవేశ పెట్టిన కియోస్క్ మిషన్, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట గోపవరం వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాధవరామిరెడ్డి, వీహెచ్ఏ హరిత ఉన్నారు.

అదిగో సంగమేశ్వరుడు



కృష్ణా జలాల నుంచి బయటపడుతున్న సంగమేశ్వరాలయం

కొత్తపల్లి: సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో సంగమేశ్వరాలయం జలాధివాసం వీడుతోంది. మండప పైభాగం నీటిలో నుంచి బయటపడటంతో సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు, భక్తులు ఆలయాన్ని చూసేందుకు తరలి వస్తున్నారు.

మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): 2022–23 సంవత్సరానికి పెట్రోల్ సబ్సిడీ కింద మూడు చక్రాల వాహనాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.విజయ గురువారం ఒక ప్రకటనలో కోరారు. స్వయం ఉపాధి, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న శారీరక విభిన్న ప్రతిభావంతులు సదరం, ఆదాయ సర్టిఫికెట్లతో పాటు రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ దరఖాస్తుకు జతపరిచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 08518–277864లో సంప్రదించాలన్నారు.

మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● ముస్తాబైన శ్రీశైల మల్లన్న, భ్రమరాంబిక స్వామివార్లు
● పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
● నేడు భృంగివాహనంపై భక్తులకు స్వామిఅమ్మవార్ల దర్శనం

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి సందర్భంగా శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, అధికారులు, ఆలయ అర్చకులు, పండితులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం పండితులు చతుర్వేదపారాయణలతో వేదస్వస్తి నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. గణపతిపూజ, వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవచనం జరిపించారు. బ్రహ్మోత్సవ నిర్వహణకు ఆధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈఓ, అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలు ధరించి రుత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్టానములు, పారాయణలు నిర్వహించారు.

అంకురార్పణ అంటే..

ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలో ఉన్న మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువచ్చి, ఆ మట్టిని 9 పాలికల్లో (మూకుళ్లలో) నింపుతారు. దాంట్లో నవధాన్యాలు పోసి మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు. అందులో భాగంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు.

ధ్వజారోహణ

ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతాకావిష్కరణ చేయడమే ధ్వజారోహణ. కొత్త వస్త్రంపై పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే నందీశ్వజపటం అంటారు. ఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి చండీశ్వరస్వామి సమక్షంలో పూజలు నిర్వహించారు. అలాగే భేరిపూజలో డోలు వాద్యానికి పూజలు చేశారు. అనంతరం నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ముక్కోటి దేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు గానూ ఈ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

నేడు భృంగివాహనసేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవ శోభ



బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభంపై ఆవిష్కృతమైన ధ్వజపటం

విద్యుత్ దీప కాంతులు

సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల ఆలయాన్ని దేవస్థానం అధికారులు సుందరంగా అలంకరించారు. ధ్వజస్తంభం, స్వామి అమ్మవార్ల ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ గోపురాలకు, గంగాధర మండపం వద్ద ప్రధాన ఆలయానికి ఎదురుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటాలతో విద్యుద్దీకరణ చేశారు. దీంతో శ్రీశైల ఆలయ పరిసరాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి.



ధ్వజారోహణ చేస్తున్న ఈఓ లవన్న, అర్చకులు

శ్రీశైల క్షేత్రం అభివృద్ధికి కృషి

● శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి తెలిపారు. ద్వాదశ పీఠారోహణ, జన్మ సువర్ణ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ ధర్మ జాగృతి మహాసమ్మేళనాన్ని గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠాధిపతి మాట్లాడుతూ జగద్గురు ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీశైలంలో 10 ఎకరాల స్థలం కేటాయించారన్నారు. 5 ఎకరాల్లో 400 గదులతో భక్తులకు వసతి సముదాయం నిర్మిస్తామన్నారు. కర్ణాటక భక్తులు ఉగాదినికి కంబి(పల్లకి)తో కాలినడకన శ్రీశైలం వస్తారని, పవిత్రంగా భావించే కంబికి పూజలు నిర్వహించుకునేందుకు కంబి మండపం, భక్తులు, స్థానికుల వైద్యసౌకర్యం నిమిత్తం 100 పడకల వైద్యశాల నిర్మాణం చేపడతామన్నారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాల, వేద సంస్కృత్ పాఠశాలలు నిర్మిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల భూమిపూజలను ఒక్కోరోజు ఒక్కో ప్రముఖుడి చేత చేపడతామన్నారు. రాష్ట్రీయ ధర్మ జాగృతి సమ్మేళనానికి కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప, ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ జగద్గురు పీఠాధిపతి విన్నపం మేరకు ముఖ్యమంత్రి జగన్‌తో చర్చించి కేబినెట్‌లో ట్రస్ట్‌కు 10 ఎకరాల స్థలం కేటాయించేలా కృషి చేశానన్నారు. భవిష్యత్‌లోనూ జగద్గురు ట్రస్ట్‌కు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు.



జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి


కర్ణాటక సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

శ్రీశైలంటెంపుల్: కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై శ్రీశైలం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. కర్ణాటక సీఎం శ్రీశైలంలో పర్యటించే ప్రదేశాలను ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఈఓ లవన్న, డీఆర్వో పుల్లయ్యలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం దేవస్థాన సీసీ కంట్రోల్ రూంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ సున్నిపెంట హెలిప్యాడ్ వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశంలో వాటర్ స్ప్రింకింగ్ చేయాలని, సేఫ్టీ రూంలో అన్ని వైద్యసదుపాయాలతో పాటు డాక్టర్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైల ఆలయంలో కృష్ణదేవరాయగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం, స్వామిఅమ్మవార్ల దర్శనం, జగద్గురు మఠం సందర్శన తదితర కార్యక్రమాల ఏర్పాట్లను శ్రద్ధతో పూర్తి చేయాలని ఈఓకు సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ దాసు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్‌బాబు, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ఈ మనోహర్, దేవస్థాన ఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో పూలమాలలతో వివేకానందుడి విగ్రహం

'వివేక' దీప్తి

స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో నరేంద్రుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడి జీవితంలో ప్రధాన ఘట్టాలను స్మరించుకున్నారు. ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన మహనీయుని బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు.

వివేకానందుడి జీవితం ఆదర్శం

కర్నూలు(సెంట్రల్): యువతీ, యువకులకు వివేకానందుడి జీవితం ఆదర్శమని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానందుడి చిత్ర పటానికి కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కరువుదీరా ఎరువులు

● రబీకి పుష్కలంగా నిల్వలు ● ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ
● అన్నదాతకు ప్రభుత్వం భరోసా

రబీ సీజన్ మొదలైందంటే చాలు గతంలో రైతులు ఎరువుల కోసం పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. ఉదయం లేచింది మొదలు దుకాణాల ఎదుట పడిగాపులు కాసేవారు. క్యూలైన్లలో నిల్చొని తమ వంతు వచ్చి ఓ బస్తా ఎరువు దొరికిందంటే వారి సంతోషానికి హద్దు ఉండేది కాదు. కొందరు సాగుకు కొన్ని మాసాల ముందే అధిక వడ్డీలకు అప్పు చేసి ఎరువులు కొని ఇళ్లలో దాచుకునేవారు. ఇప్పుడు అలా కాదు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి అన్నదాతలకు మంచి రోజులొచ్చాయి. రైతులకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా సీజన్ ఏదైనా సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. ఈ సీజన్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఇప్పటికే ఆర్బీకేలలో సిద్ధంగా ఉంచింది.

కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ: వానాకాలం ముగిసినప్పటికీ మధ్య కారు సాగు చేస్తున్న రైతుల మోములో సంతోషం వికసిస్తోంది. వర్షాలు కురవకపోయినా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. తెలుగుగంగ, కేసీ కాల్వలతో పాటు జిల్లాలోని నీటి వనరులన్నీ నిండుకుండలా తొణికిసలాడుతుండటంతో రైతులు రబీలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇప్పటికే సాగు విస్తీర్ణం అంచనాకు అనుగుణంగా విత్తనాలు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ తాజాగా ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టింది. ఈ ఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 1,85,411 హెక్టార్లు కాగా ఇప్పటికే సుమారు 1,10,000 హెక్టార్లు సాగైంది. ఈ నెల చివరికి మిగిలిన పంటలు సాగు కానున్నాయి. ఇందుకు అనుగుణంగా అవసరమైన యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీతో పాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులనూ అందుబాటులో ఉంచింది. రబీ సీజన్ ముగిసేవరకు జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని కంపెనీల వారీగా వ్యవసాయశాఖ లక్ష్యం నిర్దేశించగా జిల్లాలో ప్రస్తుతం (జనవరి నెల) 63,580 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. ఇందులో 28 మండలాల పరిధిలో ఉన్న 411 ఆర్బీకేల్లో 17,379 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులోకి తీసుకు వచ్చింది. మరో 5 వేల మెట్రిక్ టన్నులు అవసరమైన ఆర్బీకేలకు పంపిణీ చేసేందుకు మార్క్‌ఫెడ్ జిల్లాలోని గోదాముల్లో సిద్ధంగా ఉంచింది.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలోని 28 మండలాల పరిధిలో 3,35,887 మంది రైతులు ఉండగా సాగు భూమి సుమారు 2.50 లక్షల హెక్టార్లు ఉంది. కాగా ప్రతి ఏడాది రబీ సీజన్‌లో 1.50 లక్షల హెక్టార్లు సాగు జరుగుతుండగా ఈ ఏడాది రబీలో సుమారు 1,85,411 హెక్టార్ల వరకు సాగు కానుంది. ఆ మేరకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా శనగ, జొన్న, వరి, మొక్కజొన్నతో పాటు అరటి, మిరప, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.



ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న ఎరువులు

కల్తీలకు కళ్లెం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేవారు. తీరా దిగుబడి చేతికొచ్చే సమయానికి చేదు అనుభవం ఎదురవుతోంది. లోతుగా ఆరా తీస్తే కల్తీ, నాసికరమైనవని నిర్ధారణ అయ్యేది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో అన్నదాతలు కోలుకోలేక పోయేవారు. ఇలాంటి సమస్యలకు ఆదిలోనే చెక్ పెట్టాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లాలో 411 ఆర్బీకేలను అందుబాటులోకి తెచ్చి విత్తనం నుంచి ఎరువుల వరకు ఇక్కడి నుంచే పొందే అవకాశం కల్పించింది. అలాగే వాటి నాణ్యతను ఉచితంగా పరీక్షించుకునే వెసులుబాటు కల్పించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నాగులవరంలో మినుముకు ఎరువులు చల్లుతున్న దృశ్యం

ఒకటిన్నర ఎకరాల్లో వరి సాగు



కుందూనది నీటి ఆధారంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో నాకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో వరిసాగుకు నారుమడిని పోసుకున్నాను. ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బంది లేదు. రసాయన ఎరువులను కూడా ఆర్బీకేలోనే తెచ్చుకున్నాను. మరో వారం రోజుల్లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నాను. – చిన్న పుల్లయ్య, రైతు, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

అనుమానం లేకుండా



నా కున్న 30 ఎకరాలతో పాటు సుమారు 10 ఎకరాలకు పైగా కౌలుకు తీసుకుని వివిధ పంటలు సాగు చేస్తా. సీజన్‌కు సుమారు 300 బస్తాల ఎరువులు అవసరమవుతాయి. పంటలు సాగు చేసుకునే ముందే వడ్డీకి అప్పు తెచ్చుకుని ఎరువులు కొనుక్కునేవాళ్లం. అందులో నాసిరకం, నకిలీవి కొన్నైనా ఉండేవని అనుమానం. ఇప్పుడు ఆ అనుమానానికి తావు లేకుండా ఉపయోగించుకుంటున్నాం. ఎంతలేదన్నా ఏడాదికి కనీసం రూ.లక్ష వరకు ఆదా అవుతోంది. – విశ్వనాథరెడ్డి, రైతు, ఓబులంపల్లె

ఆర్‌బీకేలకు అధిక ప్రాధాన్యత



ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌బీకేలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అందుబాటులో ఉంచాం. జిల్లాలోని 6 హబ్‌ల మేనేజర్ల సహకారంతో ఆయా మండలాల ఏఓలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎరువులు కొరత లేకుండా ఆర్‌బీకేలకు సరఫరా చేస్తున్నాం. వీటితో పాటు డీసీఎంఎస్‌లు, సహకార సంఘాల్లో కూడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – నాగరాజు, జిల్లా మేనేజర్, అగ్రి ఇన్‌పుట్స్, ఏపీ మార్క్‌ఫెడ్

పుష్కలంగా ఎరువులు



విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నాం. కోటా మేరకు ఎరువులు సరఫరా జరిగేలా కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, మార్క్‌ఫెడ్ అధికారులతో తరచూ సమీక్షిస్తున్నాం. ఇంతవరకు జిల్లాలో ఎక్కడా ఎరువు కొరత అనేదే లేదు. – మోహన్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్లుప్తంగా

13 మంది స్టాంప్ వెండర్లపై వేటు


నంద్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్న 13 మంది వెండర్లపై వేటు వేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులను మూడు రెట్లు అధికంగా ధర నిర్ణయించి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఈనెల 5న కర్నూలులో, 12న నంద్యాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్నూలులో 9 మంది, నంద్యాలలో నలుగురు అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో వారి వద్ద ఉన్న స్టాంపులన్నింటినీ స్వాధీనం చేసుకుని నంద్యాల, కర్నూలు జిల్లాల రిజిస్ట్రార్లకు అప్పగించి సస్పెండ్ చేయించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్వర రెడ్డి మాట్లాడుతూ అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనల ప్రకారం స్టాంపులను అమ్ముకోవాలని, కాలం చెల్లిన వాటిని వెంటనే రిజిస్టర్ కార్యాలయాల్లో అప్పగించాలని సూచించారు.

ఎస్టీ అంధ విద్యార్థులకు రీడర్ అలవెన్స్ స్కైబ్

కర్నూలు(అర్బన్): అందులైన ఎస్టీ విద్యార్థినీ, విద్యార్థులు 2022-23 సంవత్సరానికి రీడర్ అలవెన్స్ స్క్రైబ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.విజయ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విద్యార్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులను స్వయంగా అందించాలన్నారు. రీడర్ అలవెన్స్ స్క్రైబ్ కోసం సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను జతచేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులు ఈ-శ్రామ్‌ను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ-శ్రామ్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.


గోద దిగురా చిన్నా.. అమ్మకు ఉద్యోగం వస్తోంది!


బంగారు భవిష్యత్ కోసం: నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన యువతీ, యువకులు


చిట్టి తల్లీ ఏడ్వొద్దు.. జగన్ మామయ్య ఉద్యోగాలిస్తున్నారు


నీళ్లు తాగురా కన్నా..మన కష్టాలు తీరినట్లే


అరుదైన అవకాశం: దరఖాస్తును పరిశీలించుకుంటూ..

కొలువుల జాతర

వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీలన్నింటినీ రాష్ట్రప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం కర్నూలు డీఎంహెచ్ఓ కార్యాలయంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అభ్యర్థులను పిలిచారు. ఇందులో భాగంగా 7 స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ (పీడియాట్రిషన్), 14 మెడికల్ ఆఫీసర్, 2 ఫిజియోథెరపిస్ట్, 3 క్లినికల్ సైకాలజిస్ట్, 1 ఆప్టోమెట్రిస్ట్, 1 అర్లీ ఇంటర్వెన్షనిస్ట్ కమ్ స్పెషల్ ఎడ్యుకేటర్, 29 స్టాఫ్ నర్సులు, 4 ల్యాబ్ టెక్నీషియన్, 1 డేటా ఎంట్రీ ఆపరేటర్, 1 కుక్ కమ్ కేర్ టేకర్ కలిపి మొత్తం 63 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సర్టిఫికెట్లు పరిశీలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

పైరుపై విషప్రయోగం



బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని యాగంటి పల్లె గ్రామ సమీపంలో ఉన్న మిరప పైరుపై విషప్రయోగం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. యాగంటిపల్లె గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి తనకున్న మూడెకరాల పొలంలో మిరప సాగు చేశాడు. పైరు ఏపుగా పెరగడం చూసి సంతోష పడ్డాడు. పురుగు మందు పిచికారీ చేయాలని నిర్ణయించుకుని ఈనెల 9న పొలం వద్ద డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని నీటితో నింపి ఉంచుకున్నాడు. మరుసటి రోజు పురుగు మందు కలిపి పైరుకు పిచికారీ చేశాడు. రెండు రోజుల తర్వాత పైరు ఎండుతుండటం చూసి ఆందోళన చెందాడు. వ్యవసాయాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గురువారం పొలం వద్దకు చేరుకుని పరిశీలించారు. గడ్డిమందు పిచికారీ చేయడంతోనే పైరు ఎండిపోతోందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. కాగా నిల్వ ఉంచుకున్న నీటి డ్రమ్ముల్లో గిట్టని వారు గడ్డి మందు కలిపి ఉంటారని, విచారించి న్యాయం చేయాలని రైతు కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

గంజాయి స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గురువారం వేకువజామున 25 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం నుంచి నంద్యాలకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో సెబ్ అధికారులు రాత్రి 2 గంటల సమయంలో ట్రైన్‌లో తనిఖీలు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కేసీలో ఇద్దరు చిన్నారుల గల్లంతు

గోస్పాడు: కేసీ కాలువలో ఇద్దరు చిన్నారులు గల్లంతైన ఘటన మండలంలోని జిల్లెల్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాల వెంకటేశ్వర్లు ఐదో తరగతి పూర్తి చేసి గత ఏడాది చదువుమానేశాడు. ఇమాంఉసేన్ గోస్పాడు మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి కేసీ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తూ అందులో పడి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో తాళ్ల ద్వారా పొద్దుపోయే వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదని గోస్పాడు పోలీసులు తెలిపారు.

పత్తి దగ్ధం


కాలిపోయిన పత్తి

జూపాడుబంగ్లా: ఇంటిముందు ఆరబెట్టుకున్న పత్తి అగ్నికి ఆహుతైంది. మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన రైతు ఎస్.హక్‌బాషా మూడు ఎకరాల్లో పత్తి సాగుచేశాడు. 10 క్వింటాళ్ల దిగుబడి రాగా ఇంటి ముందు ఆరబెట్టుకున్నాడు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా బయట పత్తి నుంచి పొగలు రావడం గమనించి స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నాడు. గిట్టని వారే నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు ఆరోపించారు.

క్షణికావేశానికి రెండు ప్రాణాలు బలి

ఇద్దరు కూతుర్లు సహా ఎల్‌ఎల్‌సీ కాలువలో దూకిన తల్లి

- గల్లంతైన మహిళ, ప్రాణాలొదిలిన ఏడాది పాప
- మరో పాపను కాపాడిన వ్యవసాయ కూలీలు



గల్లంతైన లక్ష్మి(ఫైల్), మృతిచెందిన బాలిక శాంతి



ఆలూరు రూరల్: క్షణికావేశం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఇద్దరు ఆడ పిల్లలతో సహా ఎల్‌ఎల్‌సీ కాలువలో దూకింది. లక్ష్మి(30) గల్లంతు కాగా.. శాంతి(1) మరణించింది. మరోపాప వెన్నెలను అక్కడి వ్యవసాయ కూలీలు ప్రాణాలతో కాపాడారు. వివరాలివీ.. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన వీరభద్రికి హొళగుంద మండలం బొమ్మగుండన హళ్లి గ్రామానికి చెందిన లక్ష్మి(30)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇతను గొర్రెల కాపరి. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం. గత కొన్నేళ్లుగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం లక్ష్మి తన ఇద్దరు చిన్న పిల్లలైన వెన్నెల, శాంతిని తీసుకుని ప్రస్తుతం బళ్లారిలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. గురువారం హత్తిబెళగల్ గ్రామానికి బయలు దేరింది. కర్ణాటక రాష్ట్రంలోని ఎర్రగుడి గ్రామం వద్ద దిగి.. ఇద్దరు పిల్లలతో సహా సమీపంలోని ఎల్‌ఎల్‌సీ కాలువలో దూకింది. పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు కేకలు వినిపించడంతో ఇద్దరు పిల్లలను ఒడ్డుకు చేర్చారు. ఇందులో శాంతి(1) చనిపోయింది. వెన్నెల ప్రాణాలతో బయటపడింది. గల్లంతైన లక్ష్మి కోసం గాలిస్తున్నారు.

రైతు సంఘం నాయకుడి హఠాన్మరణం


బంగార్‌రెడ్డి (ఫైల్)

నంద్యాల(రూరల్): నంది రైతు సమాఖ్య సభ్యుడు, మండల పరిధిలోని చాబోలు గ్రామానికి చెందిన బంగారురెడ్డి(69) గురువారం గుండెపోటుతో మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బంగారురెడ్డి తెల్లవారుజామున గుండెలో నొప్పి వస్తుందంటూ కుప్పకూలిపడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతు సమస్యలపై పోరాడే బంగారురెడ్డి సచివాలయానికి 5 సెంట్ల స్థలం దానమిచ్చారు. గ్రామంలో ఎవరైనా చనిపోయినా డీఫ్రిజిరేటర్ సమకూర్చేవారు. పేద యువతుల పెళ్లిళ్ల సమయంలోనూ తాళిబొట్టు, చీర అందజేసేవారు. ఆయన మృతిచెందాడని తెలుసుకుని పలువురు కంట తడిపెట్టారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ సభ్యులు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, తదితరులు చాబోలు చేరుకుని బంగారురెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పక్కా పథకం ప్రకారమే హత్య

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వినోద్‌కుమార్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆదోని అర్బన్: పక్కా పథకం ప్రకారమే కౌతాళం మండలం పాతకుంబళనూరు గ్రామంలో ఈనెల 7వ తేదీన ఈడిగ శివకుమార్‌ను హత్య చేసినట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. హత్యకు ఉపయోగించిన రెండు బైకులు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కౌతాళం మండలం నదిచాగి గ్రామానికి చెందిన రామన్నగౌడ్, శివకుమార్ గౌడ్ ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. అదే గ్రామానికి చెందిన డీలర్ ఈరన్న 2015లో హత్యకు గురికాగా, ఈ కేసులో వీరిద్దరితో పాటు మరికొంత మంది నిందితులుగా ఉన్నారు. డబ్బు ముట్టజెప్పి ఈ కేసు నుంచి బయటపడేలా పంచాయితీ చేసుకున్నారు. అయితే రామన్నగౌడ్ సగం డబ్బు ఇవ్వడం, మిగతా సగం మిగిలిన నిందితులు భరించేలా పంచాయితీ చేయడంతో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో వ్యక్తిగతంగా కక్ష పెంచుకుని 2020లో రామన్నగౌడ్ అనుచరుడు అయిన దేవన్నపై శివకుమార్‌గౌడ్ కత్తితో దాడి చేసినట్లు కౌతాళం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2021 జూన్‌లో రామన్నగౌడ్‌ను హత్య చేయాలని శివకుమార్‌గౌడ్ కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వం టౌన్‌కు చెందిన సుపారీ గ్యాంగ్‌తో మాట్లాడుకుని కుట్ర పన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. 2021 నవంబర్‌లో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకాలోని హొచ్చళ్లి గ్రామంలో రామన్నగౌడ్ వాహనంపై దాడి జరిగింది. అయితే వాహనంలో తమ్ముడు బసన్నగౌడ్ ఉండడంతో రామన్నగౌడ్ తప్పించుకున్నాడు. ఎప్పటికైనా తనకు ప్రాణహాని ఉందని తెలుసుకున్న రామన్నగౌడ్ ఈనెల 3వ తేదీన అతని తమ్ముడు బసన్నగౌడ్, అతని అనుచరుడు దేవన్న, దేవన్న కుమారులు రాముడు, ముదియప్పతో శివకుమార్ హత్యకు పక్కా పథకం రూపొందించాడు. గ్రామంలో పోలీసు పికెట్ ఉన్నందున పక్క గ్రామమైన పాతకుంబళనూరులో హత్యకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈనెల 7వ తేదీన సాయంత్రం పాతకుంబళనూరులో కల్లుపెంట వద్ద శివకుమార్‌పై మూకుమ్మడిగా ఐదుగురు దాడి చేసి, కళ్లల్లో కారం కొట్టి, వేటకొడవళ్లతో అతి కిరాతకంగా నరికి చంపి, అనంతరం కర్ణాటక రాష్ట్రం మాన్వం వైపు పారిపోయారని డీఎస్పీ తెలిపారు. బెయిల్ కోసం ఆదోనిలో లాయర్‌ను కలవడానికి వచ్చిన ఐదుగురు నిందితులను బుధవారం హాల్వి గ్రామం ఆర్చ్ వద్ద కోసిగి సీఐ ఎరిషావలి, ఎస్ఐ రాజారెడ్డి, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పెద్దకడబూరు పోలీసు సిబ్బంది అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన రెండు బైకులు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. త్వరితగతిన కేసును ఛేదించిన కోసిగి సీఐ, ఎస్ఐ, కౌతాళం ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. నదిచాగి గ్రామంలో ఇప్పటివరకు పోలీసు పికెటింగ్ ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరింత భద్రత పెంచామన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరం

- రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్


మాట్లాడుతున్న విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమలోని రైతులు పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో జరుగుతున్న రెండు రోజుల రైట్‌షాపు ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయంలో సన్న, చిన్నకారు రైతులు సత్ఫలితాలు సాధిస్తున్నారని, వీరిని చూసి పెద్ద రైతులు కూడా స్ఫూర్తి పొందుతున్నారన్నారు. మహిళా సంఘాలు మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల్లో అన్ని రకాల పంటలు ప్రకృతి వ్యవసాయంలోనే చేపడితే పెట్టుబడి వ్యయం తక్కువగా ఉంటుందని, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో కిచెన్ గార్డులు అభివృద్ధి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఏడాదికి సరిపడా విత్తనాలను సమకూర్చుకోవడంపై ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. రెండో రోజు రైట్‌షాప్‌లో రాయలసీమ జిల్లాలకు చెందిన ప్రాజెక్టు మేనేజర్లు ఆయా జిల్లాల ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్లు రాయుడు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సలహాలపై 19 నుంచి ఈఆర్‌సీ విచారణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారిఫ్, కాస్ట్ సబ్సిడీ, సర్ చార్జీల ప్రతిపాదనలపై, సవరణలపై ఈనెల 19వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) విచారణ జరపనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 వార్షిక సంవత్సరానికి గాను విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదనలపై ఈఆర్‌సీ బృందం 19, 20, 21వ తేదీల్లో ఆన్‌లైన్ (వీడియోకాన్ఫరెన్స్) ద్వారా విచారణ చేపడుతుందని వెల్లడించారు. వీటిపై సూచనలు, అభ్యంతరాలు, సలహాలు వ్యక్తం చేయాలనుకున్న వినియోగదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ముందుగా ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఆ తేదీల్లో కర్నూలు సర్కిల్ కార్యాలయంలో పాటు నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీసీ ద్వారా పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.